
# ఒక నిమిషం ముందుగా



ఆర్. దమయంతి

ఒక నిమిషం ముందుగా

సాయంత్రం దాటిపోయింది.

చలికాలము.....

చీకటి త్వరగా ముసురుకుంటోంది.....

రోడ్డు మామూలు రోజుల్లోలా రద్దీగా లేదు.

రిక్షాలోంచి ఆమె అటూయిటూ భయంభయంగా చూస్తోంది.

శరీరం ఐస్‌గడ్డలా చల్లగా ముద్దలా వుంది.

సన్నగా నరాల్లో వొణుకు...

ప్రకృతిలోని వాతావరణమో....

పడుతున్న ఆందోళన కారణమో...

"ఆ... ఇక్కడే ఆపు" .... రిక్షా దిగి పైసలిచ్చి పంపేసింది.

అటుగా చూసింది....

ఇంగ్లీషులో వున్న అక్షరాలు విడివిడిగా చదివి అదేహోటలని నిర్ధారణ చేసుకొంది...

నగరంలో అతి ఖరీదైన హోటల్లో అదీ వొకటి....

తన జీవితంలో ఇటువంటి హోటల్లో అడుగు పెట్టలేదు... ఆ అవకాశం రాలేదు......

కానీ...

ఇప్పుడు అవసరం వచ్చింది...

తప్పదన్నట్టు బలవంతంగా అడుగులువేస్తోంది...

రిసప్షన్ దగ్గర ఆమె చూపులు బెరుకు బెరుకుగా ఎవరికోసమో ఆత్రంగా అటూ యిటూ కదుల్తున్నాయి...

అతను.... కాదు... ఆయన... చూశాడు.....

'అమ్మయ్య!' అనుకుంది....

రమ్మన్నట్టు సైగచేసాడు....

గుండె గుభేలుమంది...

కొన్ని క్షణాల్లో తాను బలి అవ్వబోతోంది....

కాదు బలి చేసుకోబోతోంది...

ఆ తర్వాత.... తను?

తలచుకుంటుంటేనే ఏడ్పు వస్తోంది...

భయం...

వొణుకు.....

గుండెల్లో దడ....

హృదయంలో ఘోష...

అతను ముందుకు దారితీస్తూ వెనక్కితిరిగి నిముగ్గా చూశాడు 'రావేం' అన్నట్టు....

వులిక్కిపడింది..... వొక్కక్షణం తర్వాత....

అతని వెనక ఆమె నడుస్తోంది....

రూమ్ చూపించి హోటల్ అతను వెళ్ళిపోయాడు....

లోపల ఆమె... అలాగే... అక్కడ్నే... నిలబడిపోయింది...

వొక్కక్షణం కూడా కాక ముందే అతను తలుపు మూసేశాడు...

అది ఆటోమేటిక్ లాక్ సిస్టమ్...

* * *

మూడు గంటల తర్వాత...

రిక్షాలో తిరిగి వెళ్తోంది...

మంచుకురుస్తున్నా చలిగాలేదు ఆమెకి...

గుండెల్లో దడ... శరీరంలో వొణుకు... ఏమీలేదు... మామూలుగా కన్పిస్తున్నా... ఆమె మనసూ, మెదడూ... రెండూ మొద్దుబారి పోయాయి....

ఇలా ఎందుకు జరిగిపోయిందో ఆమెకి తెల్సు...

ఎలా అయిపోయిందో కళ్ళుతెరచి తెల్సుకోబుద్ధికాలేదు...

ఆలోచిస్తోంది....

తన ఈ స్థితికి కారకులు ఎవరు?...

భర్తా.....? తన పరిస్థితులా?... లేక త~ తలరాతనా?...

అంతరంగంలో ప్రశ్నలు... సుళ్ళు సళ్ళుగా ఆమెని చుట్టేసుకుంటున్నాయి....

సమాధానంగా గతం... మనస్సులో మెదిలింది.. గతాన్ని వర్తమానంతో పోల్చుకుంటే, భవిష్యత్తుకోసం తను చేసిన పని ముమ్మాటికి తప్పుకాదన్పించింది....

**కాంచనకది కలకాదని తెల్సిపోయింది. భర్త మారాడన్న సత్యం బుజువైపోయింది. హృదయ సముద్రంలో సంతోష కెరటం వువ్వెత్తున ఎగిసేలోపే విరిగి పడిపోయింది. ఏ... మం... డీ... అనలేకపోయింది.**

తనని తాను సమర్థించుకుంది....

ఈరోజు సంఘటనని వో పీడకలగా మరిచిపోవాలి...

ఔను... అసలు యిక తనకి జ్ఞాపకం రాదంతే...

గుండెదిటవు చేసుకుంది....

యింటిదగ్గర పిల్లలు తనకోసం ఎదురుచూస్తూ వుంటారు...

రాత్రయిపోయింది...

బిక్కముఖాలేసుకుని... ఆకల్తో నకనకలాడ్తూ... నిద్రకళ్ళతో తూలిపోతూ.... చిరుగుల దుప్పటి కప్పుకొని..... ఆ ఇరుకుగదిలో వో మూలగా ముడుచుకుని కూర్చున్న ఇద్దరి పిల్లల్ని తలచుకోగానే తల్లిమనసు ద్రవించిపోయింది....

డబ్బా అడుగున మిగిలిన నాలుగు బియ్యపు గింజలు గుర్తుకొచ్చాయి....

వెళ్ళంగానే వండి వాళ్ళ ఆకలి తీర్చాలి...

చలికి వణికిపోతున్న బక్కశరీరాలను తన పొత్తిళ్ళల్లో దాచుకొని తన వెచ్చని వొడిలో వాళ్ళని నిద్రపుచ్చాలి.

గుండెలకు హత్తుకొని జుట్టు నిమురుతూ....

"నానా... మీకు నేనున్నానురా.... ఇకనిక కష్టాల్లేవురా..." అని చెప్పాలి...

అప్పటికప్పుడే ఇంట్లో వాలాలని తాపత్రయపడ్తోంది...

ఆమె మనసు తపన పడ్తోంది....

రిక్షా యింటి ముందు ఆగంగానే వొక్క అంగలో దిగి రెండు రూపాయలు కాగితం ఇచ్చింది.... చిల్లర తీసుకోకుండానే యింటివైపు గబగబా అడుగులేసింది...

కానీ... అక్కడ తనను కున్న స్థితిలో లేరు పిల్లలు...

అంతకన్నా నోటిమాట రాని మరో దృశ్యం...

ఆమెని కలవరపరుస్తోంది...

ఆశ్చర్యంతో తలమునకలైపోతోంది....

భయంతోనో... భ్రాంతితోనో... ఆమె కళ్ళు వొక్కసారిగా పెద్దవైపోయాయి....


కొయ్యలా... అలాగే గుమ్మంలో నిలబడిపోయింది.

ఎదురుగా భర్త....

మూడేళ్ళ క్రితం పరారైపోయిన భర్త...

బాధ్యతారహితంగా యింటిని, యిల్లాలిని, పిల్లల్ని గాలికి వొదిలేసి వెళ్ళిపోయిన భర్త...

భార్య అంటే బానిసని.. పెళ్ళాం అంటే అవసరాలు తీర్చటం కోసమేనని... ఆడది అంటే అందుకే వుపయోగించుకోవాలని.... ఆలిమాట విన్నవాడు 'వెధవ' అనే మగాళ్ళల్లో మొదటివాడుగా చెప్పుకోదగ్గ తన భర్త... పశువులా కోర్కె తీర్చుకుని.. రాక్షసుడిలా హింసించి.. పిశాచిలా తనని మానసికంగా పీక్కుతిన్న భర్త....



ఇప్పుడెందుకు... ఎలా.. ఎవరికోసం వచ్చినట్లు?.. దిమ్మెరపోతూ చూస్తోంది...

"అలా నిలబడిపోయావేం కాంచనా... రా..." ఎంత సౌమ్యంగా వుంది ఆ గొంతు ఎంత ఆప్యాయంగా వుంది ఆపిలుపు... నివ్వెర పోతోంది...

"అమ్మా... నాన్నొచ్చారు... చూడు.. మాకేం తెచ్చారో..." సంభ్రమంగా ఆటవస్తువులను తీసుకొచ్చి చూపిస్తున్నాడు పిల్లాడు..

"అంతేకాదమ్మా.... ఇవిగో స్వీట్లు... నాకు కొత్తగౌన్లు అన్నయ్యకు బట్టలు నీకు చీరలు... ఎన్నో తెచ్చారు..."

వాటన్నిట్నీ చూపిస్తూ చెబుతోంది కూతురు...

యాంత్రికంగా కళ్ళొత్తుకుని చూస్తోంది... మూగదానిలా.. మాటే రావటంలేదు...

దగ్గరగా వచ్చిన ప్రభాకరం వైపు అదిరిపడ్డదానిలా బెరుగ్గా చూస్తోంది.

భార్యను పరిశీలనగా చూస్తున్నాడు...

ఆ చూపులో కోర్కె లేదు....

రెండు క్షణాల తర్వాత...

నిట్టూర్పు విడుస్తూ... మెల్లగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు...

"కాంచనా... ఎలా వున్నావు...."

"........."

చాలా చిక్కిపోయావు.. నేనే గుర్తుపట్టలేనం....

"................"

కాంచనా... నీకు నేను చాలా అన్యాయం చేసాను... తీరని ద్రోహం చేసాను... నేను దుర్మార్గుడిని... నాలాంటి పాపాత్ముడు ఎక్కడా... ఎక్కడా వుండడు కదూ... నిన్ను పెట్టిన కష్టాలకు నన్ను క్షమించమని... క్షమించమని అడిగేందుకొచ్చాను..." ఆపైన అతను మాట్లాడలేక పోతున్నాడు...

అతని మాటల్లో పశ్చాత్తాపం స్పష్టంగా కనిపిస్తోంది...

కాంచనకిదంతా అయోమయంగా వుంది...

అసలతను తన భర్తేనా అని అనుమానం..

ముమ్మాటికి తన భర్తే...

కానీ... యిలా మాట్లాడటం.. తను వినటం... అంతా ఏదోలా వుంది.

"నాకు తెలుసు.. నువ్వు నన్ను క్షమించలేనని... నాముఖం చూపించాలన్నా సిగ్గుగా వుంది... అందుకే... అందుకే.. చచ్చిపోదామనుకున్నా.. కానీ.. నీకు చేసిన అన్యాయానికి.. నిన్ను పెట్టిన హింసలకు... నా మరణమే నాకు శిక్ష కాదనిపించింది. అదే పరిష్కారమని పించలేదు... అందుకే వచ్చేశాను... కాంచనా.. వచ్చేశాను... నీకు భర్తలాకాదు. కాంచనా.. నాపిల్లలకి తండ్రిలా.. ఈ ఇంటికి యజమానిలా... బాధ్యతెరిగిన మగాడిలా... ఈరెక్కలు విరిచి పనిచేసి మిమ్మల్ని పోషించుకుంటూ.. కాంచనా!.. ఇకనుంచి నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు... నువ్వేమీ శ్రమపడొద్దు.. పడ్డ కష్టాలు చాలు.. కాంచనా.. నువ్విక నానీడలో విశ్రాంతి తీసుకో..."

వెర్రిదానిలా భర్త వైపే చూస్తోంది...

అలా చూడకు కాంచనా.. నన్నునమ్ము.. నేను మారిపోయా... పూర్తిగా... పూర్తిగా మారిపోయా కాంచనా... నమ్ము నన్ను నమ్ము... ప్లీజ్ నన్ను నమ్ము

కాంచనా..." ఆమె కాళ్ళను చుట్టేసుకొని విశ్శబ్దంగా ఏడుస్తున్నాడు...

కాంచనకది కలకాదని తెల్సిపోయింది. భర్త మారాడన్న సత్యం బుజువైపోయింది... హృదయ సముద్రంలో సంతోష కెరటం వువ్వెత్తున ఎగిసేలోపే విరిగి పడిపోయింది...

"ఏ... మం...డీ..." అనలేకపోయింది...

ఎంత ఘోరం జరిగిపోయింది...

తనెంత తప్పుచేసింది... కళ్ళు తిరుగుతున్నాయి...

వొళ్ళుతూలిపోతోంది.

భూమి కదుల్తోంది..

తను గిరగిరా తిరిగిపోతూ... పడిపోతోంది....

తను పడిపోతోంది...

కాంచనా... కాంచనా.. ఆదుర్దాగా పడిపోకుండా పట్టుకున్నాడు ప్రభాకర్...

* * *

అర్ధరాత్రి దాటింది....

నీరసంగా సన్నగా మూల్గుతూ... కళ్ళు తెరిచిచూచింది.

గదంతా చీకటిగా వుంది...

కిరసనాయిల్ లేక వెలుగుతున్న వొత్తి మరోక్షణంలో ఆరిపోయేట్టు వుంది....

ఆ గుడ్డివెలుతుర్లో ఆమెకి జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది...

ప్రక్కనే నేలమీద బొంతపరుచుకుని అటుగా తిరిగి పడుకున్నాడు భర్త...

భర్తను చూడంగానే గతం గుర్తొచ్చింది.

* * *

పేరుకుతగ్గ రూపం కాంచనది...

మధ్యతరగతి కన్నా వోమెట్టు కిందకుటుంబం వాళ్ళది.

ఏడోతరగతి ఎన్నిసార్లు తప్పిందో ఆమెకే జ్ఞాపకం లేదు...

పదహారు నిండగానే- ఆమె కళ్ళకి రాత్రిళ్ళు నిద్రే వుండేదికాదు... వోకునుకు పట్టినా... అందులో అన్నీ కలలే... కలవరింతలే...

బంధువులింట్లో పెళ్ళికెళ్ళినప్పుడు... ప్రభాకర్ తల్లితండ్రులు ఆమెను చూసి, యింటి కోడలిగా చేసుకోవాలని ముచ్చటపడ్డారు.

ప్రభాకర్ కూడా 'యస్' అనగానే, ఆలశ్యం చేయకుండా వెళ్ళి కాంచనని యిమ్మని అడిగారు. పైసా కట్నం లేకుండా, పెళ్ళిఖర్చులు కూడా భరిస్తామన్నారు.

పిల్లాడికి వుద్యోగం లేదు. అయితేనేం కొద్దోగొప్పో ఆస్తి వుంది... పిల్లాడా పందునాయనా... పైగా పైసా ఖర్చులేదు... ఇంకెందుకు ఆలోచించటం...?

పెళ్ళి ఖాయమైపోయింది...

కాంచనకు సిగ్గుగా వుంది...

ఆనందంతో గంతులేయాలన్పిస్తోంది..

కావాలని పిరించి చేసుకుంటున్న భర్తని తలచుకుంటుంటే గర్వంగా వుంది...

ఆస్తి పరుల యింటికి కోడలు కాబోతున్న తన అదృష్టానికి పొంగిపోయింది...

పెళ్ళయిపోయింది...

ప్రభాకర్ ఆమెని క్షణం వదిలేవాడు కాదు...

పగలు రాత్రి గదిని విడిచిపోనిచ్చేవాడు కాదు.

అదంతా ప్రేమనుకొని మురిసిపోయేది...

వొకోసారి భర్త ప్రేమ మీద కోపం, విసుగూ కల్గేవి...

ఎంత ప్రేమైతే మాత్రం?... మరీ ఇంత ఇదా.... పుండులాంటి శరీరంపై వేన్నీళ్ళుపోసుకుంటూ బాధగా అనుకునేది....

రాన్రానూ అతని ప్రేమను భరించటం కష్టంగా వుండేది.

ప్రేమపేరుతో రాత్రిళ్ళు అతను చేసే చేష్టలు తట్టుకోవడం.... ఆమె వల్ల కాకుండా పోయేది...

రెండు నెలలు తిరక్కుండానే నెలతప్పింది..

వేవిళ్ళు... జ్వరం.. నీరసం..

భర్తను సున్నితంగా తిరస్కరించేది..

కాని ... ఎదిరించి నెగ్గగల్గేది కాదు...

నిస్సహాయంగా మునిపంట బాధను నొక్కించి...



## కరెంట్

"అదేంటి బాబుగారు. పాలడబ్బుల్లో రెండ్రూపాయలు తగ్గించారు" అన్నాడు పాలవాడు విశ్వనాధంతో.

"కరెంట్ ఛార్జీలు" చెప్పాడు విశ్వనాధం.

"కరెంట్ చార్జీలెందుకండీ?" అడిగాడు పాలవాడు

"నువ్వు ముప్పయి రోజులు వాకిట్లో కొచ్చి కాలింగ్ బెల్ మోగించినందుకు" చెప్పాడు విశ్వనాధం.

—కె. భూపతి (తిరుమల)

మూగగా రోదించేది...

పురిటివంకన భర్త బారినుండి బైటపడొచ్చనుకున్న ఆమె ఆశ నిరాశే అయింది.

అత్తమామలు అందుకు వొప్పుకోలేదు.

పుట్టింటి వాళ్ళు మెత్తబడిపోయారు. ఖర్చుతప్పిందన్న సంతోషంతో వెళ్ళిపోయారు.

మొదటిసారిగా భోరునఏడ్చింది కాంచన.

మొదటి కాన్పు తర్వాత... భర్త నిజస్వరూపం కన్పించింది.

అతనికి వుద్యోగం లేదు.

వున్న రైస్‌మిల్... క్లాత్‌స్టోర్స్‌లో ఎప్పుడైనా వెళ్ళి కాసేపు కూర్చుని వస్తూండేవాడు. మిగతా టైమంతా ఎక్కడెక్కడ తిరిగి వస్తాడో తెలీదు...

అర్ధరాత్రిళ్ళు అతని రాకను మందలించేవారు అత్తమామలు...

పక్కలో అతన్నుంచి గుప్పుగుప్పున వచ్చే విస్కీవాసనలు...

అతను.. ఆయింటి పరిస్థితులు.. అన్నీ మెల్లమెల్లగా అర్థమౌతున్నాయి...

ఏడాదిలోపే మళ్ళీ గర్భవతి అయ్యింది.

ఇంట్లో అందరి ముఖాల్లో ఏదో ఆందోళన... వారం తిరక్కుండానే మామగారు నిద్రమాత్రలు మింగి చచ్చిపోయారు...

కారణం మునిగిపోయే అప్పులు తీర్చలేక..


రైస్‌మిల్, క్లాత్‌స్టోర్స్ అమ్మేసి మిగిలిన కొద్దిపాటి ఆస్తినీ, తల్లినీ తీసుకుని వెళ్ళిపోయాడు పెద్దకొడుకు.

కాంచన ప్రభాకర్ రోడ్డుమీద మిగిలిపోయారు.. రేకులయింట్లో కాపురం...

కారం మెతుకుల బ్రతుకు..

ఇద్దరు పసిపిల్లలతో.. దారిద్ర్యాన్ని అనుభవించింది...

## బుల్లెట్ ప్రూఫ్?





కోర్కె

''రమణీ? నేను లక్షాధికారిని కాకపోవచ్చు. కానీ నీ కోరికలు తీర్చగలననే నమ్మకం నాకువుంది'' అన్నాడు జగన్.

''అయితే ఓ లక్షాధికారిని పరిచయం చెయి జగన్?'' అంది రమణి.

—జి.ఎస్.శర్మ (అమలాపురం)

ఇదేం పట్టించుకోదలచుకోలేదు ప్రభాకర్...

ఇంట్లోవున్న విలువైన వస్తువులన్నీ అమ్మేశాడు...

ఇంకేవీ మిగల్లేదు..

ఇంట్లోకి అడిగితే కాంచనని పీదరిస్తూ... తిట్టేవాడు... అవసరంతో పనిలేకుండా చేయించేసుకునేవాడు..

కొన్నిరోజులు తర్వాత...

అతను యింట్లోంచి వెళ్ళిపోయాడు...

కాదు... పరారైపోయాడు...

దిక్కుతోచక దిగాలు పడి.... భోరున ఏడ్చేది... కళ్ళు అన్నీ వాచిపోయేలా... ఏడ్చేది.. భర్తకోసం ఎదురుచూసి చూసి... విసిగిపోయింది...

పొట్టకోసం కష్టపడింది...

చదువులేదు... తనకి వుద్యోగమెవరిస్తారు?

బీడీలు కట్టి రోజుకు రెండు, మూడు సంపాదించటం నేర్చుకుంది.

ఆతర్వాత...

పేరున్న బేబి బిస్కెట్ల కంపెనీలో రోజువేతనంపై పాకింగ్ చేయటం ప్రారంభించింది..

అక్కడ మేనేజర్ కళ్ళు కాంచనని పరీక్షించటం మొదలుపెట్టాయి...

అతని వయస్సు నలభై అయితేనేం... మనస్సుకు ఇరవైయ్యే!... అలా అని వెకిలి వెధవేంకాదు... చాలా పొలైట్‌గా మాట్లాడి... మత్తులో గమ్మత్తు చూపించేరకం...

మంచి మాటల్తో కాంచనకు నచ్చచెప్పాడు.. తన ఇన్‌ఫ్లూయెన్స్‌తో... ఆమెకి వుద్యోగం ఖాయపరచేలా చేస్తానన్నాడు..

చదువుకున్నవాడు... పదవిలోవున్నవాడు.. మాటతప్పడు... కాంచన— చాలారోజులు, వారాలు... నెలలు.. రెండేళ్ళు ఆలోచించింది...

మానేజర్‌కు ఆమెకన్నా ఆమె అంగీకారానికే ప్రాధాన్యత యిచ్చాడు... పాపం మంచోడు...!

కాంచనకు మరో మార్గంలేదా...

పిల్లల భవిష్యత్తుకోసం... తన బ్రతుకుకోసం... ఒక రాత్రి చచ్చిపోవటానికే నిర్ణయించుకుంది...

తన అంగీకారం తెల్పింది...

మేనేజర్ సంతోషంతో గంతులు వేయలేదు...

మనస్ఫూర్తిగానే చెప్పాడు...''కాంచనా... ఐలైక్‌యూ'' ఇంత మంచాయనకు అంత చెడ్డ బుద్ధి ఎందుకో? కాంచన సందేహం అలాగే వుండిపోయింది...

భర్త గురించి ఆలోచించటం ఇక దండుగేననుకుంది.

మేనేజర్ కోర్కె తీర్చింది...

తన కష్టాలు గట్టెక్కినాయని అనుకొంది. ఇక తనకు ఏ బాధలూ లేవని వూపిరి తీసుకుంది. కాని... కాని.. జరిగిందేమిటి?...

భర్తమారిపోయి ఇంటికొచ్చాడు...

తను... తను.. తొందరపడి... ఎంత తప్పుచేసింది?..

ఎంత ఘోరం జరిగిపోయింది...

తను భర్తకు ఎంత ద్రోహం చేసింది...

ఆయ్యో!... ఇప్పుడెలా?...

ప్రేమతో ఆశగా పరిగెత్తుకొచ్చిన భర్తకు..

అగ్నిసాక్షిగా పదిమందిలో తాళికట్టిన భర్తకు...

మలినమైన రూపం గురించి...

చెదిరిపోయిన శీలం గురించి... ఎలా ఎలా చెప్పాలి?

అసలు ఏమని చెప్పాలి?...

భగవాన్... ఎంత పని చేశావయ్యా...

ఇప్పుడేం చేయాలి?...

ఆవేదన...

గుండెల్లో మంట...

హృదయంలో ఘోష...

ఆమె లేచి కూర్చుని భర్తవైపే చూస్తోంది.

ఏమండీ...

మీరైనా... ఒక్కరోజు... ఒక్కరోజు ముందు ఎందుకు రాలేకపోయారు...

ఇన్నిరోజులు... మీ కోసం ఎదురు. చూసాను.. పాపిష్టిదాన్ని.. ఈ వొక్కరోజు వేచివుంటే.. అయ్యొయ్యో... ఇప్పుడెలాగండీ?...

నన్నేం చేయమంటారండీ...

ఏమండీ.... చెప్పండి

వొక్కమాట కూడా పైకి రావడంలేదు...

కుమిలి కుమిలి... పొగిలి పొగిలి ఏడుస్తోంది...

అతడు నిద్రపోతూనే వున్నాడు...

ఆమెలో దుఃఖం కట్టలు తెంచుకుంటోంది...

అంతా చెప్పేయాలని శతవిధాలా ప్రయత్నిస్తోంది...

ఊహూ... ఏదో బలహీనత... అశక్తత... ఆమె నోటిని బలంగా నొక్కేస్తున్నాయి...

మెదడులో హోరు...

తల నరాలు చిట్లిపోతున్నాయి...

కాదు... తల పగిలిపోయి... ధారలు ధారలుగా ఏవో ప్రోగులు చేతికొస్తున్నాయి...

మాడుమీద గట్టిగా కొట్టుకుంది.

రెండు చేతులూ జుట్టులోనికి పోనిచ్చి రెండు గుప్పిళ్ళతో జుట్టును గట్టిగా పట్టుకుంది...

రెండు నిమిషాల్లో ఆమెకి పిచ్చెక్కిపోతోంది...

కానీ...

అంతక్రితం... కొన్ని నిమిషాల క్రితం... భర్త ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాలని తీసుకొని జేబులో భద్రపరచుకున్నాడని... దానికోసమే అతను యింటి నాటకం ఆడి కల్లబొల్లి కబుర్లుచెప్పి, దొంగ కన్నీళ్ళు కార్చాడనీ, మరో కొన్ని నిముషాల్లో అతను తిరిగి పరారు కాబోతున్నాడని... తిరిగి యికరాడనీ... అతను ఈ జన్మకు మారడనీ...

పిల్లలకోసం, బ్రతుకుతెరువు కోసం...

ఆమె చేసిన పని తప్పుకాదని...

ఆమె నిర్ణయం సరియైనదేనని...

వొక నిముషం ముందుగా...

ఆమెకి పిచ్చెక్కకముందుగా...

ఎవరైనా ఆమెతో చెబితే... ఎంత బాగు ణ్ణు...! ✱





శ్రీమతి గారు తనకిష్టమైన సంగీతాన్ని, ముందుగానే రికార్డ్ చేయబడ్డ కాసెట్లను కొని వినాలనుకుంటుంది. ఆమె '' కోని '' కాసెట్లనే ఇందుకుగాను ఎన్నుకుంటుందని మీరు ఊహించే వుంటారు.

'' కోని ప్రీ-రికార్డెడ్ స్టీరియో కాసెట్ టేప్''



ఇవి సూపర్ స్టీరియో శ్రేణులలో ప్రసిద్ధి చెందిన పదాలు, ఎలక్ట్రిక్ డిస్కో పాటలు, మరియు మంచి చిత్రాలలోని పాటలు, లభ్యమవుతాయి.

డిస్ట్రిబ్యూటర్లు: వాణి ఎలక్ట్రానిక్స్

దిల్‌సుక్ నగర్, హైదరాబాద్ - 500 660.

ఫోన్ : 559119/559000PP/559567PP